సాక్షి
శ్రీకాకుళం
బుధవారం ౹ 4 ౹ సెప్టెంబర్ ౹ 2024



రుణ పరపతి దక్కేనా..?

అన్నదాతలకు రుణాల మంజూరులో జాప్యం జరుగుతోంది. కేవలం 61 శాతం వరకే రుణాలు అందించారు. -12లో



ఆలయంలో విగ్రహాలు చోరీ

దుర్భలాపురంలోని శివాలయంలో విగ్రహాలు చోరీ చేశారు. ఇవి 40 కిలోలు ఉంటాయి. -12లో

తుఫాన్ బాధితులకు లయన్స్ క్లబ్ సాయం

శ్రీకాకుళం అర్బన్: తుఫాన్ బాధితులకు అండగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నిలవటం హర్షణీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం అన్నారు. తుఫాన్ బాధితుల సహాయార్థం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రూ.25వేల చెక్‌ను కలెక్టర్‌కు అందజేశారు. సాయం చేసిన క్లబ్ సభ్యులను కలెక్టర్ అభినందించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఐసెట్ తుది విడత కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించిన ఐసెట్–2024 కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. షెడ్యూల్ మేరకు బుధవారం నుంచి 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 15వ తేదీన ఆప్షన్ల మార్పు, 17వ తేదీన అలాట్‌మెంట్ల ప్రకటన, 21వ తేదీలోపు సీట్లు లభించిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది. మొదటి విడత అలాట్‌మెంట్లు గత నెల 20వ తేదీన ప్రకటించారు. జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు, టెక్కలి ఐతం, చిలకపాలేంలోని శివానీ, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర కళాశాలల్లో ఎంబీఏ కోర్సులు ఉన్నాయి. మొదటి విడత ప్రవేశాలు మెరుగ్గా ఉన్నాయి. తుది విడత కౌన్సెలింగ్‌లో మొదటి విడత సీట్లు లభించిన విద్యార్థులు కళాశాలలు మార్పు చేసుకునే అవకాశం లభిస్తుంది. మొదటి విడత ఐసెట్ ర్యాంకు వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం లభిస్తుంది.

అంతర్జాతీయ ఈత పోటీలకు జమ్ము విద్యార్థి



ప్రవీణ్‌ను సత్కరించి స్విమ్మింగ్ డ్రస్ వితరణ చేస్తున్న చిట్టిబాబు

నరసన్నపేట: అంతర్జాతీయ స్థాయిలో ఈజిప్టులో అక్టోబర్ 10 నుంచి 13 వ తేదీ వరకూ జరగనున్న ఈత పోటీల్లో జమ్ముకు చెందిన టెంక ప్రేమకుమార్ అండర్–17 బాలుర విభాగంలో పాల్గొననున్నాడు. ఈ మేరకు ప్రవీణ్‌కు ఏపీ ఈత ఫెడరేషన్ అసోసియేషన్ నుంచి సమాచారం వచ్చింది. ప్రస్తుతం యానాం సాయి అకాడమీలో ఈత పోటీలపై ప్రవీణ్ శిక్షణ పొందుతున్నారు. పాస్‌పోర్టు పనిపై జమ్ము వచ్చిన ఈయనకు స్థానిక వైఎంసీఏ ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, క్రికెట్ సబ్‌సెంటర్ కోచ్ కుప్పిలి శ్రీనులు అభినందించారు. పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన స్విమ్మింగ్ డ్రస్, షూస్ చిట్టిబాబు వితరణ చేశారు. ఈ పోటీల్లో ప్రవీణ మంచి ప్రతిభ చూపాలని ఆయన ఆకాంక్షించారు.

తైక్వాండో మాస్టర్‌గా కొమర భాస్కర్



నిర్వాహకుల నుంచి అర్హత సర్టిఫికెట్‌ను అందుకుంటున్న కొమర భాస్కరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: తైక్వాండోలో మాస్టర్‌గా జిల్లాకు చెందిన కొమర భాస్కరరావు అర్హత సాధించారు. ఈ ఫీట్ సాధించిన మొట్టమొదటి జిల్లా వాసిగా భాస్కర్ చరిత్ర లిఖించారు. ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలోగల కేల్గాం స్టేడియంలో 112వ అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్ కోర్స్, 62వ పూండాన్ ఎగ్జామినర్ కోర్స్‌ను నిర్వహించారు. ఈ కోర్సుకు ప్రపంచ తైక్వాండో హెడ్ క్వార్టర్స్ ఆఫీసర్, చీఫ్ ఆఫ్ వరల్డ్ తైక్వాండో అకాడమీ మాస్టర్ జైవన్ కాంగ్, తైక్వాండో మాస్టర్స్ యూనియన్ గ్రాండ్ మాస్టర్ వ్యవస్థాపక అధ్యక్షుడు హాంగ్ కిట్టు హాజరుకాగా.. వారి పర్యవేక్షణలో జరిగిన కోర్సులో జిల్లాకు చెందిన తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ మాస్టర్, హోమ్‌డాన్ ఎగ్జామినర్‌గా అర్హత సాధించడం విశేషం.

బాధితులను ఆదుకోవాలని రెడ్‌క్రాస్ పిలుపు

శ్రీకాకుళం కల్చరల్: విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడానికి అంతా ముందుకురావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. బాధిత ప్రజల జీవితాల పునరుద్ధరణ కోసం ప్రతి చిన్న సహాయం చాలా దోహద పడుతుందని తెలిపారు. ఆన్‌లైన్ అయితే అకౌంట్ నంబరు 14271001 1000121, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ : UBIN0814270, జిల్లా కలెక్టరేట్ బ్రాంచ్, శ్రీకాకుళం బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలని కోరారు. మరేదైనా సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ 9133008585, 9010273741, 9948633398 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

కలమట మాటే నిజమైంది..!

- పాతపట్నంలో అక్రమ దందా
- ఎమ్మెల్యే అండతో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- ఒక వైపు ఇసుక దందా, మరోవైపు కబ్జా బాగోతం
- బదిలీలు, ఇతరత్రా వాటికి అక్రమ వసూళ్లు
- చర్చనీయాంశంగా మారిన పాతపట్నం వ్యవహారాలు

‘పాతపట్నంలో ఏ మూలన చెరువు ఉన్నా.. ఎక్కడ ఖాళీభూమి ఉన్నా.. గజంస్థలమున్నా కనిపిస్తుందా? ఒక సెంటు స్థలం కూడా కనిపించదు. కబ్జా చేసేస్తాడు. అక్రమాల స్వభావం వారిది. ఇలాంటి వ్యక్తినితీసుకొచ్చి పాతపట్నంలో నిలబెట్టారు’
– ప్రస్తుత ఎమ్మెల్యే మామిడి గోవిందరావుపై టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఎన్నికలకు ముందు చేసిన వ్యాఖ్యలివి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఇప్పుడు కలమట మాటలే నిజమవుతున్నాయి. ఇసుక అక్రమ దందా, అటవీ భూమి కబ్జా, బదిలీల్లో చేతివాటం వెరసి పాతపట్నం నియోజకవర్గం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అనుచర వర్గం బరితెగించిందన్న ఆరోపణలను మూటగట్టుకుంటోంది.



ఇసుక బాగోతం

కొత్తూరు మండలం ఆకుల తంపర వద్ద వంశధార నదిలో అక్రమ తవ్వకాలు చేపట్టి, అక్రమ రవాణా సాగిస్తున్న బాగోతం బయటపడింది. ఒడిశా రశీదులతో ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తూ కొన్ని లారీలు స్థానికులకు పట్టుబడ్డాయి. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ముఖ్య అనుచరులే ఇసుక అక్రమ రవాణా చేయడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. అయినప్పటికీ గ్రామస్తులు మొండిగా వ్యవహరించి వాహనాలను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్నాక మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కూడా అక్కడకు వచ్చి జరుగుతున్న ఇసుక అక్రమ బాగోతాన్ని ధ్రువీకరించారు. ఎప్పుడైతే కలమట రంగప్రవేశం చేశారో పరిస్థితి చేయి దాటిపోతుందని తప్పని పరిస్థితుల్లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కూడా స్పందించారు. అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సిందే అంటూ మాట కలిపారు.



పాతపట్నం రత్నాలపేటలో జోగికొండకు ఆనుకుని ఉన్న అటవీశాఖ భూమిలో టీడీపీ నాయకుడు అక్రమంగా చదును చేసిన స్థలం





ఇటీవల ఆకులతంపరలో ఎమ్మెల్యే గోవిందరావు అనుచరుల కనుసన్నల్లో రవాణా చేస్తుండగా గ్రామస్తులు పట్టుకున్న ఇసుక లారీలు

అటవీ భూమి కబ్జా

పాతపట్నంలోని రత్నాలపేట వద్ద జోగికొండకు ఆనుకుని ఉన్న రిజర్వు ఫారెస్టు భూమిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అనుచరుడు ఆక్రమించి, చదును చేసేశారు. సెంటు రూ.లక్షకు పైగా విలువ చేసే సుమారు 40 సెంట్ల అటవీ శాఖ భూమిని చదును చేసుకుని తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. ఆ పక్కనే ఉన్న తన భూమిని అడ్డు పెట్టుకుని అటవీశాఖ భూమిని కలిపేసుకున్నారు. గతంలో అటవీ శాఖాధికారులు హద్దులు నిర్ణయించి, ట్రెంచ్‌లు తవ్వారు. ఇప్పుడా హద్దులను, ట్రెంచ్‌లను కప్పేసి అటవీ శాఖ భూమిని అక్రమంగా చదును చేసేశారు.

బదిలీల్లో చేతివాటం



ఉద్యోగుల బదిలీలు అధికార పార్టీ నాయకులకు కాసులు కురిపిస్తున్నాయి. పోస్టుకింత రేటు పెట్టి బదిలీ చేస్తున్న పరిస్థితి నెలకొంది. పాతపట్నం నియోజకవర్గంలో బదిలీల ముసుగులో వసూళ్లు జరిగాయి. రూ. 20వేల నుంచి రూ. 2లక్షల వరకు పోస్టుల స్థాయి మేరకు వసూళ్లు జరిగాయి. పాతపట్నంలో ఐదుగురు దూతలున్నారు. ఎమ్మెల్యే మనుషులమని బదిలీల కోసం వసూలు చేసినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. ఇందులో అధికార పార్టీకి చెందిన వారు కూడా బాధితులుగా ఉన్నారు. ఇదిలా ఉండగా, హిర మండలంలో ఇసుక దందా చేసేందుకు నియోజకవర్గంలో మరో మండలంలో చేస్తున్న తహసీల్దార్‌ను తీసుకొచ్చేందుకు కూడా పైరవీలు జరిగాయి.

ఆశీలు పేరుతో వసూళ్లు

పాతపట్నం నుంచి ప్రతి రోజూ హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ట్రావెల్స్ బస్సులు నడుస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక బస్సుకి రూ. 800చొప్పున వసూలు చేస్తున్నారు. ఆశీల పేరుతో ఈ వసూళ్లు జరుగుతున్నాయి. తీసుకున్న సొమ్ముకు ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదు. ఇక్కడి నుంచి 30 ట్రావెల్స్ బస్సులు నడుస్తున్నాయి. ఈ లెక్కన బస్సుల ద్వారా వసూళ్ల రాయుళ్లకు ఎంత వస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఇలా చెప్పుకుని పోతే చాలా రకాల అక్రమాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు చెలరేగిపోతున్నారు. ఎమ్మెల్యే అండ ఉందని బరితెగిస్తున్నారు. ఇసుక దందా చేసేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతం ఎక్కువగా ఉండటం, పక్కనే ఒడిశా ఉండటంతో అక్కడ రశీదులు పట్టుకుని ఇక్కడ ఇసుక తరలించేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దొరికితే అది ఒడిశా ఇసుక అని, ఇవిగో రశీదులని, తప్పించుకునే ప్లాన్ కూడా చేస్తున్నారు. ఇవే కాకుండా ప్రభుత్వ భూములపై కూడా పడ్డారు. వాటిని ఆక్రమించి గుప్పెట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అటవీ శాఖ భూమి వ్యవహారం బయటపడింది. మరికొన్ని వెలుగులోకి రావల్సి ఉంది. ఓ ఐదుగురు వ్యక్తులు వసూళ్ల కోసం అదే పనిగా తిరుగుతున్నారు.

88 మందిలో 20 మందికి పింఛన్ల పంపిణీ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం దంత పంచాయతీలో 88 మందికి పింఛన్లు ఆపేసిన సంగతి తెలిసిందే. దీనిపై ‘సాక్షి’ పత్రికలో కథనాలు వెలువడ్డాయి. దీనిపై డీఆర్‌డీఏ అధికారులు స్పందించారు. ఆ 88 మందిలో 20 మంది అర్హులున్నారంటూ ఓ జాబితాను మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి ఎంపీడీఓకు పంపి, మిగిలిన 68 మందిని అనర్హుల జాబితాలో చేరుస్తూ వీరిందరినీ మరోసారి విచారణ చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో మంగళవారం సాయంత్రం 20 మందికి పింఛన్ల సొమ్మును సచివాలయ సిబ్బంది అందజేశారు. అయితే మిగిలిన వారిపై కూడా సమగ్ర విచారణ జరిపి పింఛన్లు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి సాగర్ కవచ్



సిబ్బందితో సూచనలిస్తున్న మెరైన్ సీఐ బి.ప్రసాదరావు

గార: తీర ప్రాంతాల గుండా అక్రమ చొరబాట్లను నిరోధించేందుకు రెండు రోజుల పాటు విస్తృతంగా గస్తీ చేపట్టాలని కళింగపట్నం మెరైన్ సీఐ బి. ప్రసాదరావు అన్నారు. 4, 5 తేదీల్లో నిర్వహించనున్న సాగర్ కవచ్‌లో భాగంగా మంగళవారం పలు సూచనలు చేశారు. తీర ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమైన జంక్షన్ల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సివిల్ పోలీసులు, మెరైన్, నేవీ, మత్స్యశాఖ సంయుక్తంగా ఈ కవచ్‌లో పాల్గొంటారని తెలిపారు. గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో గ్రామాలను సిబ్బందికి కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీ, ఏఎస్ఐ జగన్ సిబ్బంది పాల్గొన్నారు.

బడుల్లో మెనూ పక్కాగా అమలుకావాలి: కలెక్టర్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ పక్కాగా అమలుకావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టంచేశారు.

మంగళవారం శ్రీ కాకుళం డివిజన్ పాఠశాలలకు సంబంధించి ఎంపికైన ఎంఈఓలు, హెచ్‌ఎంలు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశమయ్యారు. డీఈఓ కార్యాలయానికి సమీపంలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. మెనూపై విద్యార్థుల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో క్రీడాస్థలాన్ని విస్తరించాలని, వాటిని అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

306 హెక్టార్లలో పంట నష్టం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తుఫాను కారణంగా జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో ఎక్కడైనా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లినా, పంట నష్టం జరిగినా వెంటనే నివేదించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకూ 306 హెక్టార్లలో పంట నష్టం, నీటి పారుదల శాఖ పరిధిలో రూ.30 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని, కరెంట్ పోల్ పడిపోయిన కారణంగా ఏపీఈపీడీసీఎల్ కు రూ.2 లక్షలు నష్టం వచ్చిందన్నారు. నాలుగు ఇళ్లు, రెండు చోట్ల కల్వర్టులు దెబ్బ తిన్నట్లు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు ఆరంభం



హోరాహోరీగా సాగుతున్న క్వాలిఫైయింగ్ రౌండ్స్ పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్స్ (అండర్–19) బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఏపీబీఏ, బాయ్ సహకారంతో శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో తొలిరోజు క్వాలిఫైయింగ్ రౌండ్స్ మొదలయ్యాయి. ఈ క్వాలిఫైయింగ్ రౌండ్స్‌కు రాష్ట్ర నలుమూలల నుంచి 135 మంది వరకు క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్నారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో మొత్తం 30 మంది క్రీడాకారులు మెయిన్‌డ్రాకు అర్హత సాధించారు. ఇందులో బాలుర సింగిల్స్‌లో 16 మంది, డబుల్స్‌లో 8 జంటలు, బాలికల సింగిల్స్‌లో 6గురు క్రీడాకారిణులు మెయిన్‌డ్రాకు అర్హత సాధించారు. ఇప్పటికే మెయిన్‌డ్రాకు 102 మంది అర్హత సాధించిన విషయం తెలిసిందే. బుధవారం నుంచి మూడు రోజులపాటు మెయిన్ డ్రా పోటీలు మొదలుకానున్నాయి. ఈ పోటీలకు చీఫ్ రిఫరీగా టి.కృష్ణప్రసాద్ (ప్రకాశం), డిప్యూటీ చీఫ్ రిఫరీగా బి.వెంకటేశ్వరరావు (విశాఖపట్నం)గా వ్యవహరిస్తున్నారు. అంపైర్లుగా 8 మంది, టెక్నికల్ అఫీషియల్‌గా 12 మంది, స్థానిక పీడీలు మరో 30 మంది వివిధ కమిటీల్లో సేవలు అందిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ సాయం



పొందూరు: మృతుడు ప్రశాంత్ కుటుంబానికి రూ. 5 లక్షల చెక్‌ను అందజేస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



సంతబొమ్మాళి: వైఎస్సార్ సీపీ పార్టీ తరఫున రూ.లక్ష చెక్కును బాధితుడికి అందజేస్తున్న పేరాడ తిలక్

పొందూరు: అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో గత నెలలో జరిగిన ప్రమాదంలో సుమారు 17 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఆ కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ మానవతా దృక్పథంతో సాయం చేస్తోందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరుకు చెందిన హసం ప్రశాంత్ అనే వ్యక్తి మరణించడంతో ఆ కుటుంబానికి మంగళవారం పొందూరులో రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని ఆ కుటుంబానికి హామీనిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్థికసాయాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, కొంచాడ రమణమూర్తి, కోట గోవిందరావు, వండాన వెంకటరావు, గుడ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం బాధితుడికి వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం

సంతబొమ్మాళి: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో చెట్లతాండ్ర గ్రామానికి చెందిన పంగ శ్రీనివాసరావు గాయపడడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ చేతులమీదుగా బాధితుడికి రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, కోటబొమ్మాళి ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పంగ రామయ్య, పంగ అప్పన్న, మార్పు నాగభూషణరావు, పి.రామకృష్ణ, కొన్న శ్రీరాములు, కళింగపట్నం నాగరాజు జి.చంద్రరావు, సుబ్బారావు, అన్నెపు రామారావు, చిన్ని జోగారావు, తదితరులు ఉన్నారు.

ఆఫ్‌షోర్ పూర్తి చేసేదెప్పుడో..?

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాలకుల నిర్లక్ష్యం కారణంగా 16 ఏళ్లయినా ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి కాకపోవడం అన్యాయమని ప్రాజెక్టుల నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం అన్నారు. నేటి కూటమి ప్రభుత్వం ఎప్పుడు పూర్తి చేస్తుందో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2008లో జలయజ్ఞంలో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. అప్పటి నుంచి పనులు జరుగుతూనే ఉన్నాయని ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలని కోరారు.

నాణ్యమైన భోజనం తప్పనిసరి




మెస్ పరిశీలిస్తున్న ఆర్‌జీయూకేటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: నాణ్యమైన మెనూ, టెండర్ల సమయంలో ఒప్పందం మేరకు భోజనం తప్పనిసరిగా పెట్టాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం ఎస్‌ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. స్థానిక అధికారులతో కలిసి మంగళవారం మెస్ పరిశీలించారు. అనంతరం భోజనం చేశారు. మెస్‌లో సురక్షిత తాగునీరు అందజేయటం, పూర్తి స్థాయి పారిశుద్ధ్యం, వంట పాత్రల పరిశుభ్రత, భోజనం ప్లేట్లు శుభ్రం చేయటం వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. రోజూ మెనూ అమలు పరిశీలించాలని, భోజనం నాణ్యత పరిశీలించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా, టెండర్ ఒప్పందం ఉల్లంఘన జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మెస్ కమిటీ సభ్యులు రోజు వారీ నివేదిక అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్త మోహన్‌కృష్ణ చౌదరి, వసతి గృహం అధికారులు పాల్గొన్నారు



వరదలో చిక్కుకున్న బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం(ఇన్‌సెట్లో) విజయవాడలో ఆర్‌ఆర్ పేటలో చంటి బిడ్డను టబ్‌లో ఉంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సంగమేశ్వరావు

శభాష్... సంగమేశ్వరరావు



విజయవాడ వరదల్లో చిక్కుకున్న వందలాది మంది ప్రాణాలను కాపాడటంలో ఏపీఎస్పీ బెటాలియన్ కీలక పాత్ర పోషించింది. జి.సిగడాం మండలం పెంట గ్రామానికి చెందిన మక్క సంగమేశ్వరరావు విజయనగరం జిల్లా ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో పీసీగా పనిచేస్తున్నాడు. విజయవాడలోని ఆర్‌ఆర్ పేటలో వరద బాధితులను రక్షించడానికి వెళ్లిన సంగమేశ్వరరావు ఓ చంటి బిడ్డను టబ్‌లో పెట్టి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఆ చిన్నారినే కాకుండా నడవలేని స్థితిలో ఉన్న పలువురు వృద్ధులను సైతం తన భుజాలపై మోసుకుని వారిని క్షేమంగా సురక్షిత ప్రాంతాలకు సంగమేశ్వరరావు తరలించాడు.

–జి.సిగడాం

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య కేసులో అత్తమామలు అరెస్టు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శ్రీనివాస రావు

నరసన్నపేట: స్థానిక శ్రీనివాస అపార్ట్‌మెంటు నాలుగో ఫ్లోర్‌లో ఆత్మహత్యకు పాల్పడిన బరాటం అనూరాధ కేసులో ఆమె అత్తమామలను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అత్త బరాటం విజయలక్ష్మి, బరాటం చిరంజీవిలను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు విచారణ చేస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో అనూరాధ భర్త శ్రావణ్‌ను అరెస్టు చేశామన్నారు. వరకట్న వేధింపుల కేసు నమోదు చేయగా.. ఆమె ఆత్మహత్యకు అత్తమామల వేధింపులు కూడా ఉన్నట్లు ఆధారాలు లభించాయని తెలిపారు. ఈ మేరకు వీరిని కోర్టులో హాజరు పరిచామని అదనపు ఎస్పీ తెలిపారు. అదనపు ఎస్పీతో పాటు నరసన్నపేట సీఐ జె. శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఉన్నారు.

అన్నదాతకు రుణ పరపతి దక్కేనా?

- పంటలకు పెరిగిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్
- ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరుకున్న తరుణంలో 60 శాతం మాత్రమే పంట రుణాల మంజూరు
- రుణాల మంజూరు ప్రక్రియలో కాలయాపన



పుటియాదళ రెవెన్యూలో ఖరీఫ్ వరి దమ్ములు చేస్తున్న రైతన్న

కవిటి: అన్నదాతను వడ్డీ వ్యాపారుల బారి నుంచి రక్షించాల్సిన ప్రభుత్వ రంగ బ్యాంకులు రుణ వితరణ ప్రక్రియను జాప్యం చేస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు 31 నాటికి వందశాతం మేరకు రుణ లక్ష్యాలను పూర్తి చేశారు. ఈ ఏడాది మాత్రం 61 శాతమే పూర్తి చేయగలిగారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వివిధ పంటలకు అందించే రుణాలను(స్కేల్ ఆఫ్‌ఫైనాన్స్) జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ(డీఎల్‌టీసీ) మార్చి నెలలోనే వెల్లడించింది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారిక ప్రకటన వెలువడలేదు. పెరిగిన సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను సవరించిన కొత్త జాబితా జిల్లా అధికారుల ఆమోదంతో అమలులోకి వచ్చింది. కూలీల రేట్లు, ఇతర పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోయిన ప్రస్తుత ఖరీఫ్ సీజన్ రైతన్నకు గుదిబండగా మారింది. రిజర్వ్ బ్యాంక్ 2019 ఖరీఫ్ నుంచి సవరించిన మార్గదర్శకాల మేరకు.. ఎలాంటి పూచీకత్తులు సమర్పించకుండానే రూ.1.60 లక్షలు పొందే వీలు కల్పించింది. ఈ నిర్ణయంతో జిల్లాలో వరి సాగు చేసే సుమారు 4.50 లక్షల మంది సన్న చిన్న కారు, పెద్ద రైతులకు ప్రయోజనం నెరవేరనుంది. 32,565 ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్న 2.12 లక్షల మంది కొబ్బరి రైతులకు ఈ పెంపుదల లాభించనుంది.

తీవ్ర కాలయాపన..

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెరిగినా ఈ ఖరీఫ్ అన్నదాతలకు రుణాలు మంజూరు చేసే ప్రక్రియలో తీవ్ర జాప్యం కనిపిస్తోంది. జిల్లాలో ఎంపిక చేసిన మూడు కేంద్రాల్లో రైతులు పంట రుణం కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఆ ప్రక్రియ సకాలంలో పూర్తి కాకపోవడంతో రుణం పొందడానికి చాలా సమయం పడుతోంది. ఇంతకుముందు ఈ విధానం లేదు. బ్యాంకు మేనేజర్ స్థాయిలోనే రుణం మంజూరు జరిగిపోయేది. ఇప్పుడు మాత్రం కాలయాపన జరుగుతోంది.

నత్తనడకన రుణాల మంజూరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో వ్యవసాయ రుణ ప్రణాళికను ప్రకటించారు. ఇందులో ఖరీఫ్ సీజన్‌కు గానూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక పంటరుణాలు, వ్యవసాయ ఇన్‌ఫ్రా రుణాలు ఏన్సిలరీ యాక్టివిటీ రుణాలన్నీ కలిపి ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.4646 కోట్లుగా నిర్ధారించారు. ఇప్పటి వరకు లక్ష్యంలో 61 శాతానికి మాత్రమే అందించగలిగారు. అయితే గత ఏడాది ఆగస్టు 31 నాటికే వంద శాతం లక్ష్యాల్ని పూర్తి చేశారు.

రైతులను ఆదుకోండి



అప్పు కోసం బ్యాంకు గుమ్మానికి వచ్చిన అన్నదాతలకు సకాలంలో రుణాలు అందించి బ్యాంకర్లు చిత్తశుద్ధి కనబరచాలి. ఈ ఏడాది అధికారులు చెబుతున్న గణాంకాలనే పరిశీలిస్తే గనక రుణాల మంజూరులో గతంతో పోలిస్తే బాగా వెనుకబాటు కనిపిస్తోంది. వ్యవసాయ రంగంపై వివక్షకు ఆస్కారం లేకుండా రైతన్నలకు తక్కువ వడ్డీ రుణాలిచ్చి ఆదుకోవాలి.

– కడియాల ప్రకాష్ మండల కన్వీనర్, కవిటి మండలం

అక్రమ కేసులు ఎత్తివేయాలని వినతి



ఎంపీ అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

రణస్థలం: సోంపేట మండలం బీల భూముల్లో పర్యావరణానికి హానికరమైన థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీన ఢిల్లీ రావు, ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. రణస్థలం మండల కేంద్రంలోని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకి ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద మంగళవారం వినతిపత్రం అందజేశారు. 2010 జూలై 14న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి కాల్పులు జరిపించి ముగ్గురు వ్యక్తులను బలిగొందన్నారు. మొత్తం 723 మందిపై వివిధ సెక్షన్ల కింద తప్పుడు కేసులు పెట్టారని తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ అప్పట్లో ప్రస్తుత సీఎం చంద్రబాబుతో కలిసి బీల ప్రాంతాన్ని సందర్శించామని గుర్తుచేశారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేలా సీఎం దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలీ బేగ్, మహిళా అధ్యక్షురాలు బద్రి సీతమ్మ తదితరులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



గాయపడిన మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన బగాది మహాలక్ష్మి అనే వివాహిత మంగళవారం తన ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మహాలక్ష్మి తన భర్త రాజారత్నం(బుజ్జి)తో మంగళవారం వేకువజామున వచ్చిన చిన్నపాటి తగాదా కారణంగా మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న డీజిల్ ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకుందని స్థానికులు తెలిపారు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు తీవ్రగాయాలకు గురైన ఆమెను హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి 50 శాతానికి పైగా కాలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చెయ్యనున్నట్లు తెలిపారు గాయపడిన మహాలక్ష్మి(సుహాసిని) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తుంది.

జాబ్‌మేళాలో 63 మంది ఎంపిక



జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: యువతీ యువకులు తమకు నచ్చిన రంగంలో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు పేర్కొన్నారు. ఆ కళాశాల సెమినార్ హాల్‌లో మంగళవారం కళాశాల జేకేసీ నోడల్ రిసోర్స్ సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా జరిగింది. ఈ మెగా జాబ్‌మేళాలో 10 ప్రైవేటు సంస్థలు పాల్గొన్నాయి. జిల్లా నలుమూలల నుంచి 187 మంది హాజరుకాగా.. వివిధ మౌఖిక పరీక్షల అనంతరం 63 మంది జాబ్‌మేళాలో ఎంపికయ్యారు. మహిళా డిగ్రీ కళాశాల నుంచి జాబ్‌మేళాలో 65 మంది పాల్గొనగా 32 మంది ఎంపికయ్యారు. వీరికి ఆయా కంపెనీ ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ, ఏపీ ఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్‌నారాయణ, జేకేసీ కోఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, డాక్టర్ వాణీకుమారి, అధ్యాపకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహాలు చోరీ



హిరమండలం దుర్భలాపురంలో చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ యాసిన్

హిరమండలం: దుర్భలాపురం గ్రామంలోని బాలకామేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆలయం తాళాలు పగలుగొట్టి ఆలయలంలో ఉన్న గణపతి, శివుడు, పార్వతి, నంది, శ్రీవల్లిదేవసేనా సుబ్రహ్మణ్య స్వామి, దుర్గాదేవి, శివలింగం, సత్యనారాయణ స్వామి పంచలోహ, ఇత్తడి విగ్రహాలను దొంగిలించారు. తెల్లవారుజామున గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ఎండీ యాసిన్ పోలీస్ సిబ్బంది మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించారు. అర్చకులు, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదే ఆలయంలో మూడు నెలల క్రితం దుండగులు చొరబడి సీసీ కెమెరాలు దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు. చోరీకి గురైన దేవతా విగ్రహాలు సుమారు 40కిలోలు ఉంటాయని పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

రణస్థలం: రావాడ పంచాయతీలో గల ఉప్పివలస గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన నోడగల సూరి అనే యువకుడు ప్రేమ పేరుతో లోబర్చుకుని గర్భవతి చేయడంపై జేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. జేఆర్ పురం పోలీసులు, బాధిత బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం ఈ నెల 2వ తేదీన బాలిక ఇంట్లో కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో వైద్యులు టెస్టులు చేయగా బాలిక ఏడో నెల గర్భంతో ఉందని తెలిసింది. వెంటనే అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. మంగళవారం ఉదయం బాలిక ఇద్దరు మగ బిడ్డలకు జన్మనిచ్చింది. ఇద్దరు పిల్లలు ప్రస్తుతం ఎస్ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు నోడగల సూరిపై జేఆర్ పురం ఎస్ఐ ఎస్. చిరంజీవి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కార్మిక శాఖ వద్దకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత ఎనిమిది నెలలుగా వేతనం అందజేయ లేదు. వేతనం సమస్యను కార్మిక శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళతామని చెప్పేందుకు వర్సిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం అనుమతులు కోరారు. అయితే ఇద్దరు ఉన్నత అధికారులు కార్యాలయంలో పీఏలకు వినతి పత్రం ఇచ్చి వెళ్లి పోవాలని ఆఫీస్ సబార్డినేట్ ద్వారా తెలియజేశారు. కార్మిక శాఖ నిబంధనల మేరకు పనిచేసిన 100 రోజుల్లోగా వేతనం ఇవ్వాల్సి ఉండగా నిబంధన అమలు జరగలేదు. మరో పక్క 34 ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన కాంట్రాక్టు సంస్థ ఒప్పందం మేరకు గుంటూరుకు చెందిన తాడేపల్లి ఏజీఎస్ మేనేజ్ మెంట్ సంస్థ ప్రతి నెల ఐదు లోపు వేతనాలు జమచేస్తామని ఒప్పంద పత్రంలో పేర్కొంది. ఈ మేరకు కార్మిక శాఖకు ఫిర్యాదు చేసి కోర్టును ఆశ్రయిస్తామని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తెలిపారు. ప్రస్తుతం సొంత ఖర్చులతో ఉద్యోగులు రోజూ వర్సిటీకి హాజరై వారికి అప్పగించిన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

తెగుళ్లతో జాగ్రత్త



పొన్నాడలో వరి పంట పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారుల బృందం

ఎచ్చెర్ల క్యాంపస్: వరి పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు బృందం తెలిపింది. పొన్నాడ గ్రామంలో వరి సాగు వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం వ్యవసాయ పరిశోధన సంస్థకు చెందిన జి.చిట్టిబాబు, ఎస్.నీలవేణి, శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ రజిని, ఎచ్చెర్ల మండల వ్యవసాయ అధికారి సురేష్‌లతో కూడిన బృందం పరిశీలించారు. వర్షాల వల్ల ఎచ్చెర్ల మండలంలో ఎలాంటి పంట నష్టాలు లేవని అన్నారు. నాట్లు వేయని రైతులు నాట్లు వేయాలని సూచించారు. నీరు అధికంగా చేరిన పొలాల్లో నీరు తొలగించాలని సూచించారు. ఎదుగుదలకు ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి వేయాలని సూచించారు. కాండం కుళ్లు, పొడ తెగులు వంటి సమస్యలు ఉంటే హెక్సాకొనజోల్ పురుగుల మందు పిచికారీ చేయాలని సూచించారు. ఆకు ముడత తెగులు వంటి సమస్య ఉంటే ప్రొఫెనోఫాస్ పురుగు మందు పిచికారీ చేయాలని సూచించారు.

పోషణ మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం పోషణ మాసోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ పోషణ మాసోత్సవాలు ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ జరుగుతాయని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

• వరద బాధితులకు 10 వేల పులిహోర ప్యాకెట్లు



సూర్యనారాయణ స్వామి ప్రసాదం పులిహోరను విజయవాడ పరిధిలోని వరద బాధితులకు ఆహారంగా అందించేలా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు ఏర్పాట్లు చేశారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తయారు చేసిన 10 వేల పులిహోర ప్యాకెట్లతో పాటు 10 వేల వాటర్ ప్యాకెట్లను సిద్ధం చేసి ప్రత్యేక వాహనం ద్వారా మంగళవారం సాయంత్రం పంపించారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ సిబ్బంది కెవి.రమణమూర్తి, బీఎస్ చక్రవర్తి, వై.శ్యామలరావు, ఎం.కావ్య తదితరులు ఉన్నారు.

–అరసవల్లి

జ్వరంతో మైత్రీ పోలీసు మృతి



తెలుకల గణేష్

ఆమదాలవలస: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మైత్రి విధానంలో విధులు నిర్వహిస్తున్న తెలుకల గణేష్ (32) అనే యువకుడు జ్వరంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. మందస ప్రాంతానికి చెందిన గణేష్ స్థానిక బంగారం షాపుల వద్ద రాత్రి వేళలో గస్తీ కాయటానికి మైత్రి విధానంలో విధులు నిర్వహిస్తున్నాడు. జ్వరంతో బాధపడుతున్న గణేష్ పట్టణంలో ఓ ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స పొందుతూ చనిపోయాడు.

తన కుమారుడికి మోతాదుకి మించి ఔషధం అందించడం వల్లనే మృతి చెందాడని మృతుడి తల్లి తెలుకుల ద్రౌపది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మందస ప్రాంతానికి చెందిన యువకుడిని ఎస్ఐ డ్రైవర్‌గా తీసుకువచ్చి మైత్రీ విధానంలో విధుల్లో ఉంచినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎస్ఐ మాత్రం బంగారం దుకాణాల వద్ద రాత్రి వేళలో గస్తీ నిర్వహిస్తున్నాడని చెబుతున్నారు.